# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 17 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం..

### నలుగురు యాదాద్రి జిల్లా వాసులు మృతి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వద్ద గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. యాత్రికులతో వెళ్తున్న తుఫాన్ వాహనం.. అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడడంతో, వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితులంతా యాదాద్రి భువనగిరి జిల్లాలోని కొండగడప గ్రామానికి చెందిన వారు. షిరిడి దైవ దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఇక నలుగురు మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారని పోలీసుల విచారణలో తేలింది. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## బస్సులను ఈ మోడల్‌లకు మార్చేందుకు సహకరించాలి

- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి సీఎం రేవంత్ రెడ్డి వినతి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కాలుష్యాన్ని నియంత్రించాలన్న లక్ష్యంలో భాగంగా హైదరాబాద్ మహానగరంలో వంద శాతం బస్సులను ఎలక్ట్రిక్ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి గారికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి గారు ఢిల్లీలో కుమారస్వామి గారిని వారి కార్యాలయంలో కలిసి ఈ విషయంపై చర్చించారు.

పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద జీసీసీ పద్ధతిలో తెలంగాణకు బస్సులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గారికి గుర్తుచేశారు.ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు ఎలక్ట్రిక్ కిట్ అమర్చి రిట్రో ఫిట్మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు అవకాశం ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రి గారి దృష్టికి తెచ్చారు. హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే 2,800 బస్సులను జీసీసీతో పాటు రిట్రో ఫిట్మెంట్ మోడల్ కింద కేటాయించాలని ముఖ్యమంత్రి గారు సీఎం విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రి వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, పొన్నం ప్రభాకర్ గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, ఎంపీలు పోరిక బలరాం నాయక్ గారు, కె. రఘువీర్ రెడ్డి గారు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి గారు, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ గారు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు గారు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.



తెలంగాణలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు అటవీ, పర్యావరణ శాఖ వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని ఇందిరా పర్యావరణ్ భవన్‌లో ముఖ్యమంత్రి గారు కేంద్ర మంత్రి గారిని కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను నివేదించారు. కేంద్ర అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో తెలంగాణ వ్యాప్తంగా 161 ప్రాజెక్టులు నిలిచిపోయాయని వివరించారు. 38 ప్రాజెక్టులకు వన్యప్రాణి సంరక్షణ చట్టాల పరమైన అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ ప్రాజెక్టుల్లో అత్యధికం రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని కేంద్ర మంత్రికి తెలియజేశారు. అనుమతులు రాకపోవడంతో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం, పీఎంజీఎస్‌వై, పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి గారి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు కొండా సురేఖ గారు, పొన్నం ప్రభాకర్ గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, ఎంపీ పోరిక బలరాం నాయక్ గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ గారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై వారితో చర్చించారు. ముఖ్యమంత్రి గారి వెంట రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, పొన్నం ప్రభాకర్ గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, ఎంపీలు పోరిక బలరాం నాయక్ గారు, రఘువీర్ రెడ్డి గారితో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

## శ్రీహరికోటలో కొత్త లాంచ్ ప్యాడ్



### ఉద్యోగుల కోసం 8వ పే కమిషన్

### కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనదారులకు మోడీ సర్కార్ శుభవార్త చెప్పింది. లక్షలాది మంది ఉద్యోగుల జీతాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు పెంచేందుకు 8వ వేతన సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రధానంగా ఇస్రోలో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దాదాపు రూ.3,985 కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రోదసిలోకి మానవుడిని పంపే ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా గుడ్ న్యూస్ చెప్పింది కేంద్రం. 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలో వేతన సంఘం చైర్మన్‌ను నియమించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. " ప్రస్తుతం ఉన్న పే కమిషన్ 2016లో ఏర్పాటు అయింది. ఆ వేతన సంఘం గడువు 2026లో ముగుస్తుంది. ఆ గడువుకన్నా ముందే, 2025లోనే 8వ వేతన సంఘం ఏర్పాటు చేయడం ద్వారా సరిపడా సమయం దొరుకుతుంది. 7వ పే కమిషన్ గడువు ముగియడానికి ముందే వేతనాల పెంపుపై సిఫార్సుల పొందేందుకు వీలు కలుగుతుంది. కొత్త కమిషన్‌కు ఛైర్మన్, ఇద్దరు సభ్యులను త్వరలోనే నియమిస్తాం" అని కేంద్ర మంత్రి తెలిపారు. కొంత కాలంగా 8వ పీఆర్సీ ఏర్పాటు కోసం ఉద్యోగులు వేచి చూస్తున్నారు. ఈ కమిటీని ఒక ఛైర్మన్, ఇద్దరు సభ్యులతో ఏర్పాటు చేయనున్నారు.

## 7 గంటలు.. ఈడీ ప్రశ్నల వర్షం..!

- నిబంధనలను ఎందుకు ఉల్లంఘించారు
- ముగిసిన కేటీఆర్ విచారణ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఈడీ అధికారులు ఫార్ములా ఈ కారు రేస్ కేసులో విచారించారు.గురువారం 7గంటల పాటు ప్రశ్నల వర్షం కురిపించిన తర్వాత ఆయన్ని వదిలేశారు. అయితే ఈడీ అధికారులు ఈకేసులో ఏసీబీ లేవనెత్తిన అంశాలపైనే ప్రశ్నలు వేసిందని సమాచారం. కారు రేసు నిర్వాహణలో హెచ్‌ఎండీఏని పార్టనర్‌గా ఎందుకు చేర్చారనే విషయంతో పాటు ఇండియన్ కరెన్సీ రూ. 45కోట్ల ను పౌండ్లుగా మర్చి పంపడంపై ఆరా తీసింది. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణలో నిబంధనలను ఎందుకు ఉల్లంఘించారని కేటీఆర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సూటిగా ప్రశ్నించారు. 48కి పైగా ప్రశ్నలను సంధించిందని తెలిసింది. ఈ సందర్భంగా ఆయన వెంట వచ్చిన న్యాయవాదిని వెలుపల రిసెప్షన్‌లోనే కూర్చోబెట్టి కేవలం కేటీఆర్‌ను మాత్రమే లోనికి తీసుకెళ్లి అధికారులు విచారించారు.



ఫార్ములా-ఈ కార్ రేసింగ్ ప్రారంభంలో ఉన్న కంపెనీ మధ్యలోనే ఎందుకు వైదొలిగింది మొదలుకొని లండన్‌లోని ఎఫ్‌ఈఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకునే వరకు ఎలాంటి విధానాలను అనుసరించారని ఈడీ ప్రశ్నించింది. ముఖ్యంగా, యూకేలోని ఎఫ్‌ఈఓ కంపెనీకి రూ.45 కోట్లను బదిలీ చేసేందుకు మీరు హెచ్‌ఎండీఏ మాజీ కార్యదర్శి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డిలపై ఒత్తిడిని తీసుకొచ్చారా? అని కూడా ఈడీ కేటీఆర్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. యూకే పౌండ్ల రూపంలో డబ్బులు బదిలీ జరిగినపుడు మీకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుమతిని తీసుకోవాలని తెలియదా? ఆ సందర్భంలో ఈ డబ్బులు బదిలీ జరిపే సమయంలో హిమాయత్‌నగర్ ఐఓబీ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారా? అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం. అలాగే, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌లో హెచ్‌ఎండీఏను భాగస్వామ్యం చేసేందుకు మీరు ప్రభుత్వానుమతిని తీసుకున్నారా? హెచ్‌ఎండీఏ నుంచి ఈ-కార్ రేసింగ్ కోసం రూ.55 కోట్ల పెట్టుబడిని పెట్టాలనేది మీ స్వంత నిర్ణయమా? అని కూడా అధికారులు ప్రశ్నించారని తెలిసింది.

అదే సమయంలో, గ్రీన్‌కో కంపెనీ నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.47 కోట్లను మీరు ఎలా తీసుకున్నారు? అని ఈడీ.. కేటీఆర్‌ను ఆరా తీసినట్టు సమాచారం. కాగా, ఈడీ వేసిన పలు ప్రశ్నలకు తాను ఏది చేసినా.. నిబంధనల మేరకే చేశాననీ, ఈ విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని కేటీఆర్ సమాధానమిచ్చినట్టు తెలిసింది.ఇదంతా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ కక్షతో నడిపిస్తున్న కేసు అని, ఇందులో తాను ఎలాంటి పొరపాటూ చేయలేదని కేటీఆర్ అన్నట్టు సమాచారం.

ఈడీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు చేరుకొని.. కేటీఆర్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు.. బీఆర్ఎస్ కార్యకర్తలను మొదట వెళ్లిపోవాలని చెప్పి, తర్వాత చెదరగొట్టారు.



## లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం

- రేవంత్‌రెడ్డి సిద్ధమా..?
- రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్ రెడ్డిపై ఏసీబీ, ఈడీ కేసులు ఉన్నాయని చెప్పి.. తనపై కూడా ఏసీబీ, ఈడీ కేసులు నమోదు చేయించి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ కేసుల్లో వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలియజేసేందుకు తాను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం.. రేవంత రెడ్డి సిద్ధమా..? అని కేటీఆర్ సవాల్ విసిరారు. ఈడీ విచారణ ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

ఎన్నిసార్లు విచారణకు పిలిచానా, నేను సిద్ధమేనని విచారణకు పూర్తిగా సహకరిస్తానని ఈడీకి చెప్పానని వివరించారు. ఏసీబీ కేసు పెట్టింది కాబట్టే ఈడీ కూడా విచారణ చేపట్టిందని వెల్లడించారు. దాదాపు ఏడు గంటల పాటు అడిగిన ప్రశ్నలనే అడిగారని ఏసీబీ, ఈడీ సంస్థల ప్రశ్నలు ఒకేలా ఉన్నాయని చెప్పారు. ఏసీబీ 80 ప్రశ్నలు, ఈడీ 40 ప్రశ్నలు అడిగారని తెలిపారు. ప్రజా ధనం దుర్వినియోగం చేస్తున్నారని తనపై పెట్టిన కర్చుతో పథకాలనైనా సమర్థవంతంగా అమలు చేయవచ్చని అన్నారు. నేనూ, రేవంత్ రెడ్డి.. జడ్జి ముందు కూర్చుంటాం ఎన్ని ప్రశ్నలైనా అడగండి అని అన్నారు. దమ్ముంటే మీడియా ముందుకు రావాలన్నారు. ఇద్దరం కూర్చుందాం ఎవరు దొంగ ఎవరో తేలిపోతుంది అని అన్నారు. డేట్, ప్లేస్, టైం ఫిక్స్ చేయాలని రేవంత్ కు కేటీఆర్ సవాల్ విసిరారు. లై డిటెక్టర్ పరీక్షకు సైతం సిద్ధమని కేటీఆర్ అన్నారు. విచారణకు ఎన్నిసార్లు పిలిచినా.. ఎన్ని ప్రశ్నలకైనా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నా అని తెలిపారు. నేనేం తప్పు చేయలేదని.. అరపైసా కూడా అవినీతి జరగలేదని తేల్చి చెప్పారు."

## విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'స్కిల్ స్ప్రింట్'

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

విద్యార్థులు, నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు 'టీ వర్క్స్', యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'స్కిల్ స్ప్రింట్' పేరిట ప్రత్యేక ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ విషయమై రూపొందించిన పోస్టర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. 'తెలంగాణను నైపుణ్య మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్ గా మారుస్తాం. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర యువతలో ఉద్యోగ నైపుణ్యాల పెంపుదలకు కృషి చేస్తున్నాం' అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. స్కిల్ స్ప్రింట్‌కింద 90 రోజులపాటు ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం ఉంటుంది. 'స్కిల్ స్ప్రింట్' కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్, రోబోటిక్స్, మేనేజ్ మెంట్, సేల్స్, బిజినెస్ డెవలెప్ మెంట్, మార్కెటింగ్ తదితర రంగాల్లో డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తాం.



సంబంధిత పరిశ్రమల నిపుణులు మార్గనిర్దేశం (మెంటార్ షిప్) చేస్తారు. టీ – వర్క్స్ లోని అధునాతన సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవచ్చు. సొంతంగా ప్రాజెక్టులను రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తాం. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా అకాడమిక్ క్రెడిట్స్ ఇస్తాం' అని తెలిపారు. ఆసక్తి గల కళాశాలలు, విద్యార్థులు టీ -వర్క్స్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. Yisu.in వెబ్ సైట్లో కూడా వివరాలు దొరుకుతాయి. ఈ కార్యక్రమంలో టీ- వర్క్స్ సీఈవో తనికెళ్ల జోగిందర్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఇంఛార్జి రిజిస్ట్రార్ ఛమాన్ మెహతా పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### 12 మంది మావోయిస్టులు మృతి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ మేరకు బస్తర్ ఐజి పి.సుందర్‌లాల్ ప్రకటించారు. దక్షిణ బస్తర్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారంతో బీజాపూర్, దంతేవాడ, సుక్మా జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, కోబ్రా 204, 205, 206, 208, 210, సీఆర్పీఎఫ్ 229 బెటాలియన్‌ల సంయుక్త పోలీసులు వెయ్యి మంది అడవులను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురుపడగా ఇరువురి మధ్య భారీగా కాల్పులు జరిగాయి. ఘటన స్థలం నుంచి పెద్దఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు ఐజీ తెలిపారు. 12 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయన్నారు.

ఈ ఏడాది ఆరంభంలో పక్షం రోజుల్లో సుమారు పాతిక మంది మావోయిస్టులు ఇప్పటివరకు మృతిచెందారు. జనవరి 3న గరియాబాద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. జనవరి 9న సుకుమా జిల్లా పాలగూడాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు, అదేవిధంగా ఈనెల 12న బీజాపూర్ జిల్లా మద్దెడు బందే పారాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. గురువారం జరిగిన కాల్పుల్లో 12 మంది మృతిచెందారు. ఇదిలా ఉంటే జనవరి 6న బీజాపూర్ జిల్లా నయమేడు అడవుల్లో భద్రత బలగాలు ప్రయాణం చేస్తున్న స్కార్పియో వాహనాన్ని మావోయిస్టులు భారీ మందు పాతర పెట్టి పేల్చడంతో 9 మంది పోలీసులు, డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన విషయం విదితమే.



## ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పార్టీ రెండు పిటిషన్లు దాఖలు చేసింది. 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన 9 నెలలు అవుతున్నా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ పేర్కొంది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, డాక్టర్ సంజయ్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, మహిపాల్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని కోర్టుకు బీఆర్ఎస్ తెలిపింది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ పేర్కొంది. గతంలో కేశం మేఘా చంద్ర కేసులో ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోర్టును బీఆర్ఎస్ కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో తీర్పు వచ్చిందని గుర్తు చేసింది. మేఘా చంద్ర కేసు తీర్పుకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని బీఆర్ఎస్ తెలిపింది. నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది.

## లిక్కర్ పార్ట్‌నర్‌ను ఓడించాం.. సూత్రధారులను ఓడించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

లిక్కర్ స్కాం పార్ట్ నర్ గా ఉన్న బీఆర్ఎస్ ను తెలంగాణలో ఓడించామని, అసలు సూత్రధారులను ఓడించేందుకు ఢిల్లీకి వచ్చామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన రెండు గ్యారెంటీలను విడుదల చేశారు. ఢిల్లీలో అధికారంలోకి వస్తే రూ. 500కే సిలిండర్ అందిస్తామని, గృహావసరాలకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలల పూర్తయిందని, ఏడాదిలోపు 25 లక్షల 50 వేల రైతు కుటుంబాలకు 21 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా రుణమాఫీ చేయలేదని అన్నారు. రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి గ్యారెంటీని నిలబెట్టుకున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది లోనే 55,140 సర్కారు ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు. మోదీ ప్రధాన మంత్రి అయ్యి 11 ఏండ్లవుతుందని, ఇప్పటి వరకు కేవలం ఏడు లక్షల ఉద్యోగాలే ఇచ్చారని అన్నారు. వాస్తవానికి ఆయన ఇవ్వాల్సినవి 22 కోట్ల కొలువులని అన్నారు. తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలో పు గృహావసరాలకు ఫ్రీ కరెంటు ఇస్తున్నామని చెప్పారు. తెలంగాణలో తాము ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని అన్నారు. మూడు సార్లు కేజ్రీవాల్ సీఎం, మోడీ పీఎం అయినా ఢిల్లీ అభివృద్ధి చెందలేదని అన్నారు. షీలా దీక్షిత్ సీఎంగా ఉన్న సమయంలోనే హస్తిన అభివృద్ధి చెందిందని, దేశంలోనే అతి పెద్ద మెట్రో ను నిర్మించినన ఘనత షీలాదీక్షిత్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీకే దక్కిందని చెప్పారు దేశ రాజధానిగా ఉన్న ఢిల్లీ అభివృద్ధికి నిధుల కోసం కేంద్రంతో పోరాడుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తమ పార్టీకి లోక్ సభలో వంద మంది ఎంపీల బలం ఉందని, కేంద్రాన్ని నిలదీస్తామని అన్నారు. పార్లమెంటులో బలమే లేని ఆప్ ను గెలిపిస్తే ప్రయోజనం ఉండదని సీఎం అన్నారు.




## సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి..

- తెల్లవారుజామున ఇంట్లోనే దాడికి పాల్పడ్డ దుండగుడు
- ఆరు చోట్ల గాయాలు
- ప్రాణాపాయం లేదన్న వైద్యులు
- ముంబయి పోలీసుల దర్యాప్తు

**బలగం టీవి, ముంబై**

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. గురువారం తెల్లవారుజామున ముంబైలోని ఆయన నివాసంలోకి చొరబడిన దుండగుడు కత్తితో సైఫ్‌పై దాడి చేశాడు. దీంతో ఆయన ఒంటిపై ఆరుచోట్ల గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన లీలావతి దవాఖానకు తరలించారు. సైఫ్‌కు విజయవంతంగా శస్త్రచికిత్సచేసి కత్తిని తొలిగించినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ప్రమాదం నుంచి బయటపడ్డారని ప్రకటించారు.వివరాల్లోకెళ్తే.. సైఫ్ అలీఖాన్ పటౌడీపై గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి దాడి చేశాడు. ముంబయి బాంద్రాలోని తన నివాసంలో సైఫ్ అలీఖాన్, ఆయన భార్య కరీనా కపూర్ ఖాన్, పిల్లలతో కలిసి రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఒక దుండగుడు వారి ఇంట్లోకి ప్రవేశించాడు. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో అలికిడి కావడంతో నిద్రలేచిన సైఫ్ దుండగుడిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇద్దరికీ ఘర్షణ జరగ్గా గుర్తుతెలియని వ్యక్తి పదునైన ఆయుధంతో సైఫ్‌ను పలుమార్లు పొడిచి పారిపోయాడు.



సైఫ్ అలీఖాన్



నిందితుడు

సైఫ్ అలీఖాన్ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదుతో ముంబయి బాంద్రా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఆర్ఐను నమోదైంది. దాడి ఘటనను ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌తో సైఫ్ ఇంటి పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ టీమ్‌లు నటుడి ఇంటి వద్ద ఆధారాలను సేకరించాయి. నిందితులను పట్టుకునేందుకు పది బృందాలు ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు.

# ఖమ్మంలో కొత్త మార్కెట్‌ను నిర్మిస్తా

- పత్తి కాలిపోవడం దురదృష్టకరం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం పత్తి మార్కెట్ పరిశీలన

బలగం టీవీ, హైదరాబాద్



ఖమ్మం పత్తి మార్కెట్‌లో రాత్రి పత్తి కాలిపోవడం దురదృష్టకరం అని, రైతులకు, వ్యాపారస్తులకు సౌకర్యంగా ఉండేలా కొత్త మార్కెట్‌ను నిర్మిస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం పత్తి మార్కెట్‌లో బుధవారం రాత్రి జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో దాదాపు 400 పత్తి బస్తాలు అగ్నికి ఆహూతయ్యాయి. సంక్రాంతికి ముందు కొందరు వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తి అగ్ని ప్రమాదంలో బూడిదైంది. గురువారం ఖమ్మం మార్కెట్‌ను మంత్రి పరిలిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ'మార్కెట్‌లో రాత్రి పత్తి కాలిపోవడం దురదృష్టకరం. కారణం ఏంటో ఇంకా తెలీదు. నష్టం అంచనా వేస్తున్నాం. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చూస్తా. ఈ మార్కెట్‌ను రూ.100 కోట్ల రూపాయలు పెట్టి అభివృద్ధి చేస్తా. ' అని తెలిపారు.

'మిర్చి మార్కెట్ కారణంగా చుట్టుపక్కల ప్రజలు నా మీద ఫిర్యాదులు చేస్తున్నారు. మద్దులపల్లి మార్కెట్‌ను 10, 15 రోజుల్లో ప్రారంభిస్తాం. ఖమ్మం మార్కెట్‌కు, ప్రజలకు ఒత్తిడి సమస్యలు ఉండకూడదు. మార్కెట్ నిర్మాణం కలెక్టర్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు. అతి త్వరలో మార్కెట్‌కు స్వరూపం మారాలి, అప్పటివరకు రైతులు అంతా సంయమనం పాటించాలి. మార్కెట్‌లో ఓ ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేస్తాం. గతంలోనూ ఉండేది, ఇప్పుడు ఏర్పాటు చేస్తాం. పసుపు బోర్డు వేరే రాష్ట్రాల్లో కావాల్సి ఉండగా.. నేను మన రాష్ట్రానికి కావాలని కోరాను. ప్రధాని నా అభ్యర్థన మేరకు బోర్డు ప్రకటించారు' అని చెప్పారు.



# కేసీఆర్‌తో కలిసి మొక్కలు నాటిన హిమాన్షు

బలగం టీవీ, హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనయుడు హిమాన్షు తన తాత కేసీఆర్ తో కలిసి వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటాడు. ఇందుకు సంబంధించిన 40 సెకన్ల వీడియోను అతను తన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశాడు. హిమాన్షు పారను పట్టుకొని గుంత తవ్వుతుండగా కేసీఆర్ పక్కనే నిలబడి సూచన చేస్తున్నారు. గుంతను తవ్వి, ఓ మొక్కను నాటి ఆ తర్వాత దానికి నీరు పోశాడు. ఆ తర్వాత అదే పారతో... చెట్టు నాటిన గుంతను మట్టితో నింపేశాడు. ఈ వీడియోకు 'లెర్నింగ్ ఫ్రమ్ ది బెస్ట్' అని కేసీఆర్‌ను ఉద్దేశించి క్యాప్షన్ ఇచ్చాడు. వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడానికి చెట్లు పెంచడం ఎంతో అవసరమని, మన సహజ వనరులను రక్షించడం... సంరక్షించడం మన బాధ్యత అని ఎక్స్ వేదికగా వీడియోను పోస్ట్ చేసి ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దు

- అధికారులకు మంత్రి సీతక్క సూచన
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సమీక్ష సమావేశ

బలగం టీవీ, హైదరాబాద్



ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దని అధికారులకు మంత్రి సీతక్క సూచించారు. అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని అన్నారు. గురువారం తెలంగాణ సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారులు నిబద్ధతతో పనిచేసి శాఖ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. శాఖకు వన్నె తెచ్చేలా పనిచేయాలని సూచించారు. శాఖపరంగా వాస్తవాలనే నివేదించాలని అన్నారు. మంత్రుల మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొద్దని చెప్పారు. అధికారులు, అమాత్యులు వేర్వేరు కాదన్నారు. మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దని చెప్పారు. మీ కింది ఉద్యోగులతో సంప్రదింపులు జరపండి, వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. రూ. 300 కోట్ల ఎన్ఆర్ఈజీఏ బిల్లులను నిన్న విడుదల చేశామని మంత్రి సీతక్క అన్నారు.

మల్టీ పర్పస్ వర్కర్ల వేతన బకాయిలను విడుదల చేశామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే ప్రతి విభాగంలో ఉద్యోగ సమస్యలను ఆన్‌లైన్‌లో పరిష్కరించే విధానాన్ని అవలంబించాలని అన్నారు. అర్హులైన ప్రతి గర్భిణి, బాలింత, చిన్నారికి పోషకాహారం అందించాలని అన్నారు. ఆ దిశలో జిల్లా సంక్షేమ అధికారులను సిద్ధం చేయాలని చెప్పారు. అంగన్వాడీ సేవలపై చిన్నారుల పేరెంట్స్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటామన్నారు. ప్రతి నెలలో ఒకసారి ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రుల అభిప్రాయాల మేరకు అంగన్వాడీ సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంగన్వాడీకి వచ్చే గర్భిణులు కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి ఇబ్బందులను తొలగించే విధంగా అంగన్వాడి కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. దివ్యాంగుల పరికరాల కోసం తెలంగాణ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని డ్రైవ్ నిర్వహించి దివ్యాంగులకు పరికరాలను అందజేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# నామినేటెడ్ పదవి ఇవ్వకుంటే గాంధీ భవన్ మెట్ల మీద ధర్నా చేస్తా

- కార్పొరేషన్ పదవులలో మహిళలకు అన్యాయం జరిగింది.
- కాంగ్రెస్ మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు.
- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు సంచలన వ్యాఖ్యలు

బలగం టీవీ, హైదరాబాద్



తనకు నామినేటెడ్ పదవి ఇవ్వకుంటే గాంధీ భవన్ మెట్ల మీద ధర్నా చేస్తానని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు హెచ్చరించారు. ఒక బీసీ మహిళగా, ముదిరాజ్ బిడ్డగా నామినేటెడ్ పదవికి అన్ని రకాలుగా తాను అర్హురాలినని స్పష్టం చేశారు. తాజాగా ఆమె మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీ చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడని గుర్తు చేశారు. పదవి దక్కకుంటే పీసీసీ చీఫ్‌ని అడ్డుకుంటానని తేల్చి చెప్పారు. రాహుల్ గాంధీ అమలు చేస్తున్న నారీ న్యాయ్ తెలంగాణలో జరగడం లేదు. అసెంబ్లీ టికెట్ వదులుకుంటే రూ.5కోట్లు ఇస్తానని బీఆర్ఎస్ నేత గడ్డం శ్రీనివాస్ ఆఫర్ ఇచ్చాడు. అయినా నేను వదులుకోలేదు. ఓడిపోయే గోషామహల్ టికెట్ నాకు ఇచ్చారు. నాకు బీజేపీ, బీఆర్ఎస్ నుంచి టికెట్ ఇస్తానని ఆఫర్ ఇచ్చారు. చివరకు బీజేపీ మహిళా అధ్యక్షురాలి పదవి కూడా ఇస్తానని చెప్పారు.. అయినా నేను పార్టీని వీడలేదు. ఇప్పుడు నన్ను అధ్యక్ష పదవి నుండి తప్పించాలని చూస్తున్నారు. కార్పొరేషన్ పదవులలో మహిళలకు అన్యాయం జరిగింది. పురుషులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. కష్టపడ్డ వారిని పట్టించుకోలేదు. మేము చేపట్టిన కార్యక్రమాలకు ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ రాలేదు. దీపాదాస్ మాకు టైమ్ ఇవ్వలేదు. మా ఫోన్ ఆమె లిఫ్ట్ చేయట్లేదు. ఈ విషయంలో కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ పెద్దలని కూడా కలిశాను. నేను చేసిన తప్పు ఏంటి?. ఎన్నికల్లో పోటీ చేయడం నా తప్పా?. మహిళ కాంగ్రెస్‌ను నడిపించడం అంత ఈజీ కాదు. కాంగ్రెస్ మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. అల్ ఇండియా మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ అల్కా లాంబ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తాం. పార్టీలో కష్ట పడ్డవారికి కాకుండా వేరే వాళ్లకు అవకాశం ఇస్తే పోరాటం చేస్తాను. నేను అందరిని కలుపుకొనిపోయే వ్యక్తిని. అన్ని పదవులకు నేను అర్హురాలిని. మహిళలకు ఇక్కడ ప్రాధాన్యత లేదని ఏఐసీసీ ఇంచార్జ్ గురదీప్ సింగ్ సపర్ చెప్పారు. ఏ పదవి ఇచ్చినా చేపట్టడానికి నేను సిద్ధం. త్వరలో 33% మహిళ రిజర్వేషన్ అమలు చేస్తామని కేసీ వేణుగోపాల్, అల్కా లాంబ మాట ఇచ్చారు" అని అన్నారు.

## యాదాద్రిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి

బలగం టీవీ, హైదరాబాద్

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారిపై భువనగిరి మున్సిపాలిటీ రాయగిరి సమీపంలో వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి పెట్రోల్ పంపులోకి వెళ్తున్న లారీని వెనక నుండి బలంగా ఢీకొట్టింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న ఓ మహిళ, చిన్నారి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. మృతులు మహబూబాబాద్ జిల్లా కేసముద్రంకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వరంగల్ నుండి హైదరాబాద్ వైపు వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. పెట్రోల్ పంపులోకి వెళ్తున్న లారీని వెనుక నుండి కారు బలంగా ఢీకొట్టడంతో ప్రమాద సంభవించిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హాస్టల్‌లో విద్యార్థినిపై లైంగికదాడి

- నిందితుడికి అదుపులోకి తీసుకున్న పోలీసులు

బలగం టీవీ, హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో దారుణం జరిగింది. ఇంజినీరింగ్ ఫస్ట్ఇయర్ విద్యార్థినిపై ఓ డ్రైవర్ హాస్టల్‌లోనే లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. ఇబ్రహీంపట్నంలోని ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న 18 ఏండ్ల యువతి మంగళపల్లిలోని ఓ హాస్టల్ ఉంటోంది. సెమిస్టర్ ఉండడం వల్ల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. బుధవారం రాత్రి 11గంటల సమయంలో ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న అజిత్ హాస్టల్‌లోకి చొరబడి యువతి ఒంటరిగా ఉండడం చూసి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## మహిళ దారుణ హత్య..!

- ఇంట్లోనే పాతి పెట్టిన వైనం
- తాళం వేసి పరారైన భర్త, అత్త, మామా

బలగం టీవీ, హైదరాబాద్

మహబూబాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఓ వివాహితను దారుణంగా హత్య చేసి ఇంట్లోనే పాతిపెట్టారు. ఈ విషాదకర సంఘటన మహబూబాద్ లోని సిగ్నల్ కాలనీలో చోటు చేసుకుంది. అయితే తల్లిదండ్రులతో కలిసి భార్యను కిరాతకంగా భర్త హతమార్చినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్య చేసిన అనంతరం ఇంటికి తాళం వేసి భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచు పరారయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. పాతిపెట్టిన చోట తవ్వగా వివాహిత మృతదేహం బయటపడింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వివాహితను హతమార్చి గొయ్యి తీసి పూడ్చి పెట్టిన అనంతరం శవాన్ని పూడ్చిన బొందపై కట్టెల పొయ్యి పెట్టి పిండి వంటలు చేసుకున్నారని తెలిసింది. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఓఎంఆర్ పద్ధతిలో నీట్ యూజీ-2025 పరీక్ష

బలగం టీవీ, న్యూఢిల్లీ



ఎంబీబీఎస్ సహా యూజీ-వైద్య విద్యాకోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే నీట్‌పై జాతీయ పరీక్షా సంస్థ (ఎన్టీఏ) సంచలన ప్రకటన చేసింది. సింగిల్ డే – సింగిల్ షిఫ్ట్‌లో పెన్– పేపర్ మోడ్ (ఓఎంఆర్ బేస్డ్)లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఖరారు చేసిన మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నది. ఎంబీబీఎస్‌తోపాటు బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్ఎంఎస్ కోర్సులకు యూనిఫామ్ నీట్ (యూజీ) పరీక్ష నిర్వహిస్తామని ఎన్టీఏ తెలిపింది. నీట్ (యూజీ) ఫలితాల ఆధారంగా నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి కింద బీహెచ్ఎంఎస్ కోర్సు అడ్మిషన్లు నిర్వహిస్తారు. దీంతోపాటు ఆర్మ్‌డ్ మెడికల్ సర్వీస్ హాస్పిటల్స్‌లో బీఎస్సీ నర్సింగ్ కోర్సు అడ్మిషన్లకు నీట్ (యూజీ) క్వాలిఫై కావాల్సి ఉంటుంది. నాలుగేండ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు కూడా నీట్ (యూజీ) కోర్సులో అర్హత సాధించాల్సి ఉంటుందని ఎన్టీఏ తెలిపింది.



# తరువాత ఎవరు?

- నాయకుల్లో అరెస్టు భయం
- ప్రభుత్వ పట్టా అంటేనే గుబులు
- తప్పు చేశాం అంటూ పట్టాలు వెనక్కి

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

తంగళ్లపల్లి మండలంలో తరువాత ఎవరూ? అనే మాట ఎక్కువగా వినిపిస్తోంది. ఇటీవల ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ పట్టాల బాగోతం బహిర్గతం అవుతుండటం వాటిలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల పేర్లు బయటతుండటంతో మండలవ్యాప్తంగా దుమారం రేగుతోంది. ఇప్పటికే ముగ్గురు బీఆర్ఎస్ నాయకులను రిమాండ్ చేయగా.. ఆదివారం మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలు సైతం జైలుపాలయ్యారు. ఇదిలా ఉండగా తరువాత ఎవర్ని అరెస్టు చేసి రిమాండ్ చేస్తారోనని మండలవ్యాప్తంగా తీవ్ర చర్చ సాగుతోంది. ఇదంత కక్షపూరితంగా సాధింపు చర్యగా బీఆర్ఎస్ నాయకులు అభివర్ణిస్తుండగా, చేసిన పాపాలకు శిక్ష అనుభవిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. మండలంలో ప్రభుత్వ భూములను ఫలహారంలా మేసిన నేతల గుట్టు ఒక్కోటి బయటకు వస్తుండడంతో మండలంలోని సామాన్య జనాలు ముక్కున వేలేసుకుంటున్నారు.

## తెల్వక కొన్నా తప్పని తెలిసి వాపస్ ఇచ్చినా...

- మండెపల్లి మాజీ ఎంపీటీసీ భర్త బుస్స లింగం

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

ప్రభుత్వ భూములు కొనకూడదని తనకు తెలియక ప్రభుత్వ భూమిని కొన్నానని తప్పని తెలిసి కలెక్టర్‌కు సరెండర్ చేసినట్లు మండెపల్లి మాజీ ఎంపీటీసీ భర్త బుస్స లింగం బుధవారం సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. 2017లో తాను పనిచేసే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కొందరి సలహా మేరకు మండెపల్లిలోని ప్రభుత్వ సర్వే నంబర్ 365లో తక్కువ ధరకు సాదాబైనామా ద్వారా ఎకరం ప్రభుత్వ భూమి కొనుగోలు చేశానన్నారు. 2019లో తన భార్య ఎంపీటీసీగా స్వప్న ఇండిపెండెంట్ గా గెలిచిందని ఆ తరువాత మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరామని తెలిపారు. తన భార్య అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి భూకబ్జాలకు, నీతిమాలిన పనికి పాల్పడలేదని పేర్కొన్నారు. రెవెన్యూ చట్టం, ప్రభుత్వ నిబంధనలు తెలుసుకుని ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్‌కు అప్పగించినట్లు తెలిపారు. కొంత మంది వారి అవసరాల కొరకు తనను బదనాం చేస్తున్నారని వాపోయారు. కానీ ప్రభుత్వ భూమిని ఎవరి వద్ద కొన్నారు? ఎంతకు కొన్నారు? అనే విషయాలను మాత్రం వెల్లడించకపోవడం గమనార్హం.

# రుద్రంగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ

**బలగం టీవీ ,రుద్రంగి**

జన్మనిచ్చిన నా స్వగ్రామం రుద్రంగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు . గురువారం రుద్రంగి మండల కేంద్రంతోపాటు ఉమ్మడి మానాల పరిధిలో రూ. 2 కోట్ల 03 లక్షలతో నూతన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ ల నిర్మాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, రాష్ట్ర కో ఆపరేటివ్ ఛైర్మెన్ మానాల మోహన్ రెడ్డి తో కలసి భూమి పూజ నిర్వహించారుఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదం, ప్రోత్సాహం వల్ల రుద్రంగి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని అన్నారు .రుద్రంగిని ఆదర్శంగా నిలిపేందుకు కలెక్టర్ సహకారాలు అందిస్తున్నారని, నూతన కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నవరి 26 నుండి మంజూరు చేయబోతున్నామని అన్నారు . మిడ్ మానేరు ముంపు గ్రామాల ప్రజలకు 238 కోట్లతో 4696 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని,

ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా రైతులకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రుద్రంగి లో మెయిన్ రోడ్డు లో సైడ్ డ్రైన్ ను 1 కోటి 27 లక్షలతో నిర్మాణం చేసుకున్నామని, మన గ్రామంలో రోడ్డు ఎత్తుగా ఉంటే వాటికి అనుసంధానంగా 12 ప్రాంతంలో మైన్ రోడ్డుకు కలుపుకునామాని అన్నారు . కేజీబీవి లో ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నాం.బోర్ వెల్ కూడ మంజూరు చేసుకున్నామని ,జిల్లాలో మొట్టమొదట సరిగా కేజీబీవి విద్యార్థులకు ఐఐటి, జేఈఈ,నీట్ కోచింగ్ కోసం జిల్లా కలెక్టర్ చొరవతో ఆన్లైన్ ఎడ్యుకేషన్ ప్రారంభం చేసుకున్నామని అన్నారు.

రూ.16 లక్షలతో దసరా, బతుకమ్మ పండుగ సందర్భంగా సెంట్రల్ లైట్స్ ఏర్పాటు చేసుకున్నామని, రూ. కోటి 50 లక్షలతో అంబేద్కర్ చౌరస్తా నుంచి హనుమాన్ ఏరియా మీదిగా ఇందిరా చౌక వరకు సీసి రోడ్డు మంజురి చేసుకున్నామని అన్నారు . రుద్రాంగి వాసులు చిరకాల కోరిక ప్రభుత్వ ఆసుపత్రికి భూమి పూజ చేసుకున్నామని,ఇప్పటికే పనులు శరవేగంగా సాగుతున్నాయని వివరించారు. 6 నెలల్లో ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో 43



కోట్ల తో మన గ్రామానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, రామకృష్ణపూర్ పల్లె కు వెళ్ళడానికి 60 లక్షలతో కల్వర్ట్ నిర్మాణనికి భూమి పూజ చేసుకున్నామని అని అన్నారు. మర్రిపల్లి, కలికోటా రిజర్వాయరు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఛందుర్తి – మోతుకురావుపేట రోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చామని,త్వరలోనే మొదటి దశ పనులు ప్రారంభం అవుతాయయని అన్నారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళ తల్లులను కోటీశ్వర్లను చేయడానికి ఇందిరా మహిళ పథకాన్ని తీసుకువచ్చారని తెలిపారు.జిల్లాలో 600 కోట్లను మహిళా తల్లులకు కేటాయించడం జరిగిందనిఅన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి, మద్దతు ధరతో కొనుగోలు చేశామని, ఇప్పటికే రాష్ట్రంలో మహిళ తల్లులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షల వరకు పెంచామని అన్నారు .200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గుర్తు చేశారు.దేశ చరితరలోనే ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని ఏక కాలంలో 2 లక్షల రుణమాఫి చేయడం జరిగిందని అన్నారు.



### అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పట్టిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. రైతు భరోసా కు సంబంధించి అధికారులు వ్యవసాయ యోగ్యమైన భూమో కాదా అని మాత్రమే పరిశీలించాలని, భూ భారతి (ధరణి) నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి సదరు లబ్దిదారులను తొలగించాలని అన్నారు. రైతు భరోసా కింద ఏడాదికి ప్రతి ఎకరాకు 12 వేల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ యోగ్య మైన ప్రతి ఎకరాకు పంట వేసినా, వేయక పోయినా రైతు భరోసా అందుతుందని అన్నారు.

భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12,000 రూపా యలకు రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించిందన్నారు. సామాజిక ఆర్థిక సర్వే కింద మన సిరిసిల్ల జిల్లాలో 9వేల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు లేదని తేలిం దని, మండలాలలో ఎంపీడీవోలు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్ నూతన రేషన్ కార్డుల జారీ పర్యవేక్షించాలని అన్నారు. గ్రామ లేదా వార్డు సభల ద్వారా అర్హులైన జాబితాన్ని ఆమోదింప చేసుకొని రేషన్ కార్డులను గణతంత్ర దినోత్సవ సందర్భంగా నూతన రేషన్ కార్డుల ప్రోసిడింగ్స్ పంపిణీ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిర్వహించిన సర్వేలో భూములు కొన్న అత్యంత పేదలకు మొదటి జాబితాలో మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.

జనవరి 16 నుంచి జనవరి 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన చేసి జనవరి 21 నుంచి జనవరి 24 వరకు గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న 4 కార్యక్రమాల మార్గదర్శకాలు, ఉద్దేశం ప్రజలకు వివరిస్తూ పథకాల అర్హుల జాబితాను ప్రజలందరికీ తెలిసేలా ప్రదర్శించాలని, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత తుది జాబితా తయారు చేసే జనవరి 26 నుంచి 4 పథకాల అమలును ప్రారంభించాలని అన్నారు.కార్యక్రమంలోమార్కెట్ కమిటి చైర్మన్ చెలకల తిరుపతి,ఈఈ సుదర్శన్ రెడ్డి, డి ఆర్ డి వో శేషాద్రి, డి ఈ పవన కుమారి, ఎంపీడీవో



## రామాలయ ఆలయ కమిటీ ఎన్నిక

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెళ్ళ గ్రామంలోని శ్రీ సీతారాముల ఆలయ రాములబండ నూతన కమిటీ అధ్యక్షుడిగా దుబ్బక రమేష్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రానున్న రాములబండ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు,గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## నిధుల మంజూరుపై బీజేపీ నాయకుల హర్షం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హెూం సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపఠలకు పాలభిషేకం నిర్వహించారు. మండలం లోని సీసీ రోడ్ల నిర్మాణానికి కోటి75 లక్షల మంజూరయ్యాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెన్నమనేని శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు ఇటుకల రాజు, మహేందర్,జనరల్ సెక్రెటరీ కాళీ చరణ్,మహిళా అధ్యక్షురాలు కోడం భవిత, సోషల్ మీడియా కన్నె అరుణ్ కుమార్,బీజేవైఎం మండల అధ్యక్షుడు కొసిని వినయ్, అమర గొండ రాజు,శీను,బాల మల్లేశం,రాజు,మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేద్దాం

**బలగం ,తంగళ్ళపల్లి**

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ని మండల అధ్యక్షుడు ఏగుర్ల కరుణాకర్ హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించారు . ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్ కృష్ణయ్యకు మద్దతుగా నిలుస్తామన్నారు.

# క్వార్టర్స్‌కు భారత జట్లు..!



- ఖోఖో ప్రపంచకప్‌లో సత్తా చాటుతున్న భారత్, మహిళల జట్లు
- పెరూపై 38-70తో భారత్ పురుషుల జట్టు విజయం
- ఇరాన్‌పై 16-100 తేడాతో మహిళల జట్టు గెలుపు

**బలగం టీవి, హైదరాబాద్**

ఖో ఖో ప్రపంచకప్ 2025లో వరుస విజయాలతో భారత పురుషులు, మహిళల జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 70-38 తేడాతో పెరూను ఓడించింది. గ్రూప్-ఏలో ఉన్న భారత పురుషుల జట్టుకు ఇది హ్యాట్రిక్ విజయం. భారత్ తరపున ప్రతీక్, ఆదిత్య, శివారెడ్డి, సచిన్ సత్తా చాటారు. పెరూతో జరిగిన మ్యాచ్‌లో భారత్ నాలుగు టర్న్‌ల్లో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. తొలి టర్న్‌లో 36 పాయింట్స్ సొంతం చేసుకున్న భారత్.. తర్వాతి మూడు టర్న్‌ల్లో ఆధిపత్యం చెలాయించి 70 పాయింట్లతో విజయలాంఛనాన్ని పూర్తి చేసింది.

**భారత అమ్మాయిలు కూడా..**

మరోవైపు భారత అమ్మాయిల జట్టు గ్రూప్-ఏ పోరులో 100-16 తేడాతో ఇరాన్‌ను చిత్తు చేసింది. భారత్ తరపున అశ్విని, నిర్మల, ప్రియాంక, నస్రీన్ సత్తా చాటారు. ప్రియాంక 'బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'అవార్డను సొంతం చేసుకుంది. అంతకుముందు భారత మహిళల జట్టు తన తొలి మ్యాచ్‌లో 175-18 తేడాతో సౌత్ కొరియాను ఓడించిన విషయం తెలిసిందే.







## ఆ రిపోర్ట్స్ అన్నీ ఫేక్ : బూమ్రా

**బలగం టీవి, హైదరాబాద్**

ఆస్ట్రేలియా వేదికగా జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో చివరి మ్యాచ్‌లో బూమ్రా వెన్నునొప్పి కారణంగా ఇబ్బంది పడిన సంగతి తెలిసిందే. అక్కడి వైద్య సిబ్బందితో స్కానింగ్‌కు వెళ్లాడు. కానీ ఆ పరీక్షల్లో అతడి గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలియడం వల్ల రెండో ఇన్నింగ్స్‌కు మళ్లీ ఆటలోకి రాలేదు. దాంతో రానున్న ఛాంపియన్స్ ట్రోఫీకి బుమ్రా దూరం కానున్నాడంటూ పలు వార్తలు వైరలయ్యాయి. వెన్ను గాయంతో బాధపడుతున్నందున బుమ్రాను బెడ్ రెస్ట్ తీసుకోవాల్సిందిగా డాక్టర్లు సూచించారని, అందుకే ఛాంపియన్స్ ట్రోఫీలో అతడు వచ్చేది అనుమానమే అంటూ ఆ వార్తల సారాంశం. కానీ తాజాగా ఈ రూమర్స్‌పై బుమ్రా స్పందించాడు. ఆ వార్తల్లో ఎటువంటి వాస్తవాలు లేవంటూ కొట్టిపారేశాడు. ఫేక్ న్యూస్ చాలా ఈజీగా స్ప్రెడ్ అవుతుంటుందని కౌంటర్ ఇచ్చాడు."ఫేక్ న్యూస్ వ్యాప్తి చేయడం చాలా సులువు. ఆ విషయం నాకు బాగా తెలుసు. అయితే ఈ న్యూస్ నాకు నవ్వు తెప్పించింది.ఆ రిపోర్ట్స్ అన్నీ ఫేకే" అంటూ నవ్వు ఎమోజీలను ఆ పోస్ట్‌కు జత చేశాడు.



## మహా కుంభమేళాలో 'కోట్లాది భక్తుల మధ్యలో షూటింగ్ చేస్తున్నాం

- బోయపాటి శ్రీను

**బలగం టీవి, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ హీరోగా డైరెక్టర్ బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న సినిమా 'అఖండ 2: తాండవం'. 2021లో బ్లాక్‌బస్టర్ విజయం అందుకున్న 'అఖండ'కు ఇది సీక్వెల్‌గా తెరకెక్కుతోంది.ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమమైన మహా కుంభమేళాలో జరుగుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి మాట్లాడుతూ 'మహా కుంభమేళా ఏర్పాట్లు అద్భుతంగా చేశారు. దాని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మాది అఘోర నేపథ్యంలో సాగే సినిమా కాబట్టి ఇక్కడ షూట్ చేస్తున్నాం. అఘోర, నాగ సాధువులను కూడా కలిశాం. 11వ తారీఖు నుంచే మేం ఇక్కడ ఉన్నాం. ఈ రోజుతో ఇక్కడ షూట్ పూర్తవుతుంది. ఇన్ని కోట్ల మందిలో కూడా మా ప్రయత్నంలో లోపం లేకుండా షూటింగ్ కొనసాగిస్తున్నాం' అని బోయపాటి పేర్కొన్నారు. కోట్ల మందిలో కూడా షూటింగ్ చేస్తున్నామంటే తమ ప్రయత్నం ఎంత గట్టిదో అర్థం చేసుకోవాలని అన్నారు.

14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పకురాలు. తమన్ సంగీతం అందిస్తున్నారు.దసరా సందర్భంగా 2025 సెప్టెంబరు 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## వెన్నెల కిషోర్ నా వారసత్వాన్ని కొనసాగిస్తాడు

- బ్రహ్మానందం

**బలగం టీవి, హైదరాబాద్**




బహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బ్రహ్మ ఆనందం'. వెన్నెల కిషోర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ చిత్రం. గురువారం ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. అయితే ఈ టీజర్ వేడుకలో బ్రహ్మి మాట్లాడుతూ.. ఈ మధ్య మొహం చూడగానే నవ్వు తెప్పించే వారిలో వెన్నెల కిషోర్ ఉన్నాడు. వెన్నెల కిషోర్ తెరపై కనిపిస్తే చాలు ఆటోమేటిక్‌గా నవ్వు వస్తుంది. నా వారసత్వాన్ని కొనసాగించే వారిలలో వెన్నెల కిషోర్ ఒక్కడు. అంతా సరదాగా నటిస్తాడు కిషోర్ అంటూ బ్రహ్మి చెప్పుకొచ్చాడు. అలాగే ఇంకా ఆయన మాట్లాడుతూ 'నేను సినిమాలు చేయడం లేదని ఈ మధ్య కొందరూ అంటున్నారు. అలాగే బ్రహ్మి బాగానే చేస్తున్నాడు కానీ ఇంతకుముందు చేసినట్లు చేయట్లేదు అని కామెంట్లు కూడా వినిపించాయి. అయితే దీనికి కారణం నా వయసు. మన వయసును మనం దృష్టిలో పెట్టుకోవాలి. ఎందుకంటే ఇంతకుముందు చేసినట్లు ఇప్పుడు చేయాలంటే కుదరదు. ఇంతకుముందు చాలా యాక్టివ్‌గా చేసేవాడిని కానీ ఇప్పుడు అలా లేదు. అందుకే సినిమాలు తగ్గించాను. అంతేగానీ నాకు అవకాశలు రాకపోవడం.. లేదా చేయలేక కాదు.. 30 ఇయర్స్ ఇండస్ట్రీ అన్న పదాలు మెడలో తగిలించుకోవడానికే పనికి వస్తాయి. అందుకే ఎప్పటికప్పుడు మనల్ని మనం చెక్ చేసుకుంటూ ఉండాలి" అని అన్నాడు. "సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడూ నన్ను నేనే ఉపయోగించుకోలేదు. ఎప్పుడూ ఎవరి వద్దకు వెళ్లి ఆఫర్ల కోసం అడిగింది లేదు. నాకు 40 ఏళ్ల సినీ కెరీర్‌లో అలాంటి అవసరం రాలేదు. మనం అనుకున్నంత మాత్రాన, ప్రయత్నించినంత మాత్రాన జరగదు. మన తలరాత ఎలా ఉంటే అలాగే జరుగుతుంది. ఎంతో మంది స్టార్స్ వారసులు సైతం ఇండస్ట్రీలోకి వచ్చారు. కొందరు సక్సెస్ అయ్యారు, కొందరు కాలేక పోయారు. అది వారి తలరాత అనుసారం ఉంటుంది, తప్ప ఏదో ప్రయత్నిస్తే జరిగి పోతుందని నేను ఎప్పుడూ నమ్మను. మనకు రావాల్సిన ఆఫర్‌లు వెతుక్కుంటూ వస్తాయి" అని బ్రహ్మానందం అన్నారు.

## సైఫ్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా : చిరంజీవి, ఎన్టీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**

సైఫ్ అలీఖాన్ పై దుండగుడి దాడి విషయంపై టాలీవుడ్ ప్రముఖులు స్పందించారు. దాడి విషయం తెలిసి ఎంతగానో కలత చెందానని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.అలాగే జూనియర్ ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'సైఫ్ సర్‌పై దాడి గురించి విని షాక్‌కు గురయ్యా. ఇది నిజంగా బాధాకర విషయం. ఆయన త్వరగా కోలుకోవాలని, పూర్తి ఆరోగ్యంతో తిరిగిరావాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని అన్నారు.



## కోహ్లీ రికార్డు బద్దలు కొట్టిన పడిక్కల్

**బలగం టీవి, హైదరాబాద్**

టీమిండియా యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ చరిత్ర సృష్టించాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో 2000 కంటే ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్లలో అత్యధిక యావరేజ్ కలిగిన బ్యాటర్‌గా దేవదత్ పడిక్కల్ నిలిచాడు. ఈ క్రమంలో అతను రుతురాజ్ గైక్వాడ్, మైఖేల్ బెవన్, విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్‌ల రికార్డ్‌లను అధిగమించాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా హర్యానాతో జరిగిన సెమీఫైనల్లో ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ 113 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 86 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో కర్ణాటక 5 వికెట్ల తేడాతో గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన హర్యానా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 237 పరుగులు చేసింది. అనంతరం కర్ణాటక 47.2 ఓవర్లలోనే 5 వికెట్లకు 238 పరుగులు చేసి గెలుపొందింది. పడిక్కల్‌తో పాటు రవిచంద్రన్ సమరన్(76) రాణించాడు. ఈ మ్యాచ్ ద్వారా పడిక్కల్ లిస్ట్-ఏ క్రికెట్‌లో 2000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ సీజన్‌లో ఏడు ఇన్నింగ్స్‌ల్లో 50 ప్లస్ రన్స్ చేశాడు. 86,102, 114, 93 నాటౌట్, 70, 117, 71 పరుగులతో రాణించాడు. 2021-22 విజయ్ హజారే ట్రోఫీలోనూ పడిక్కల్ వరుసగా ఏడు సార్లు 50 ప్లస్ రన్స్ చేశాడు. లిస్ట్ క్రికెట్‌లో పడిక్కల్ యావరేజ్ 82.38గా ఉంది. దాంతో లిస్ట్ క్రికెట్‌లో అత్యధిక యావరేజ్ కలిగిన బ్యాటర్‌గా పడిక్కల్ నిలిచాడు. ఈ జాబితాలో పడిక్కల్ తర్వాత రుతురాజ్ గైక్వాడ్(58.16), మైకేల్ బేవన్(57.86), విరాట్ కోహ్లీ(57.05), ఏబీ డివిలియర్స్(53.47)లు కొనసాగుతున్నారు. విజయ్ హజారే ట్రోఫీలో పడిక్కల్ నిలకడగా రాణించడంతో అతన్ని ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

## రాజన్న సిరిసిల్ల జిల్లా వృద్ధురాలు ఘనత

- 70 ఏండ్ల వయసులో ప్రపంచ అథ్లెటిక్స్‌లో కాంస్యం

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన టమాటం రామానుజమ్మ 70 ఏండ్ల వయసులోనూ సత్తా చాటారు. ప్రపంచ అథ్లెటిక్ పోటీల్లో కాంస్య పతకం సాధించారు. కర్నాటకలోని మంగళూరులో ఈనెల 11 నుంచి 13 దాకా జరిగిన ఒకటవ సౌత్ ఆసియా మాస్టర్ అథ్లెటిక్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలలో భాగంగా.. రామానుజమ్మ 800 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్యం గెలిచారు.